డేటింగ్

ప్రకాశరావు

'రేపు సాయంత్రం శర్మగారింటికి వస్తామని చెప్పాం'. కామాక్షమ్మగారు ఉపోద్ఘాతంగా అన్నారు.

'నాతో చెప్పడ మెందుకూ?' బింకంగా జవాబిచ్చాడు రఘు, పెరుగన్నం కెలుకుతూ.

చిన్నగా నవ్వుకున్నారు కామాక్షమ్మగారు. 'నీవు రాకపోతే ఎలా? శర్మగారు నాలుగు నెల్లుగా చూస్తున్నారు, నీవు ఢిల్లీ నుండి ఎప్పుడువస్తావా అని. నీకునచ్చితే ఈ నెల్లోనే ... '

'నచ్చలేదనిచెప్పేయండి.' గడుసుగా అడ్డుతగిలాడు రఘు.

'ఏం, నచ్చకపోవడానికి? మరీ బెట్టు చేయ కన్నయ్యా. మా ఫ్రండును వేలెత్తి వంక చూపించలేవు తెలుసా.

చక్కగా వుంటుంది—నీవు కథల్లో వ్రాస్తావే, అలినీలవేణి, అపరంజి బొమ్మ, అందాలభరిణ అంటూ...'

'హే! మీ ఫ్రండు సంగతి నాకు తెలీదు. వూరికే నా జోలికి రాకు. అంత చక్కగా వుంటే నాకేం? ఆ గోడ కూడావుంది చక్కగా.' ఉరిమిచూశాడు రఘు చెల్లెలివేపు.

'నీవు వూరుకోవమ్మా, సరోజా. మంచిబాబువుకదూ. రఘూ అంత దూరంలో ఒంటరిగా ఎన్నాళ్లని వుంటావు? నీవో ఇంటివాడివైతే మా బాధ్యత తీరిపోతుంది. వాళ్లమ్మాయి సరోజ క్లాసుమేటట. నిజంగా బావుంటుంది, నీకు తగ్గట్టుగా బాగా బారు.'

'నీదేనా చామన ఛాయ కాని మా ఫ్రండు మల్లెమొగ్గలా వుంటుంది తెలుసా!' సరోజ ఉడికిస్తూ అంది.

రఘు విరుచుకు పడేవాడే కాని ఇంతలో పరంధామయ్యగారు రావడంతో గబగబా చేయి కడిగేసుకుని బయట కెళ్లాడు, కళ్లతోనే సరోజను బెదిరిస్తూ.

తల్లితో నైతే గారాలుపోయాడు కాని తండ్రి 'ఏరా! రేపు వెళ్తావూ?' అంటే 'అలాగే నాన్నా!' అని బుద్ధిమంతుళ్లా తలవూపాడు రఘు

శర్మగారింటినుండి తిరిగి వచ్చిం తరవాత మరీ ఆటలు పట్టించింది సరోజ.

'అన్నయ్యా, మా ఫ్రండే నయం. నాలుగుసార్లుచూసింది నీవేపు. కాని నీవు తలేనా ఎత్తి చూళ్లేదు సరిగా, నీవేమేం అడుగుతావోనని చాలా అనుకున్నా కాని అసలు ఏం మాట్లాడలేదేం నీవు?'

'మనవాళ్లింకా ఈ పెళ్లి చూపులో అని పాతికమంది గుంపులో కూర్చోబెడతారు. వీధిలో వాళ్లందరినీ పోగు చేసుకుని, ఆ బొమ్మల మధ్య మీ ఫ్రండు ఎక్కడా కనిపించలేదు, ఇక. ఏ బొమ్మ గారినేం అడగాలో తెలీక నోరుమూసు క్కూర్చున్నా.' విసుక్కున్నాడు రఘు.

'మరేం చేద్దాం చెప్మా? మా ఫ్రండు ఫోటో తెప్పించనా, నిన్ను డైరక్టుగా చూట్టం కుదరలేదుట మా అన్నయ్యకు అని...'

'చత్వారమనుకుంటుంది మీ ఫ్రండు. చూడుసరూ! ఓ చిన్న పనిచేసిపెడతావూ బంగారు తల్లివి కాని. కాస్త ఫోనుచేసి మీ ఫ్రండును పిలు.'

'ఎందుకేం?' కొంటెగా అడిగింది సరోజ.

'కాస్త పనుంది కానీ, ప్లీజ్.'

'చూడన్నయ్యా, నాకు ప్లాటంతా చెబితే గాని పిలవను. నీవు ఫోన్లో ఏమేనా అంటే నాకు చీవాట్లు వడ్డిస్తారు' పెద్ద ఆరిందాలా సరోజ పోజు.

సరోజతో దెబ్బలాడి ప్రయోజనం లేదని ప్లానంతా క్లుప్తంగా చెప్పాడు రఘు.

అదంతా విని, 'అమ్మో! ఏమో నను కున్నా. ఫరవాలేదు. అయిడియా బాగానే వుందికానీ మా రేఖను సరిగా చూడనేను లేదుకదా నీవు. మరి ఎలాగుర్తుపడతావు? నన్నుకూడా వెంటతీసుకెళ్తేగాని మా ఫ్రండురాదు.' మడత పేచీవేసింది సరోజ.

దేవుడా! అనుకున్నాడు రఘు. కాని సరోజ ఒక్క మిల్లీమీటరు కూడా తగ్గకపోవడంతో అసలుకు మోసం వస్తూందని ఒప్పేసుకున్నాడు పైగా సరోజ చెప్పిందాంట్లో పాయింటు బలంగా వుందికూడా.

'నీ పేరు చెప్పకు. రాధ అనో, ఫ్రండ్ అనో చెప్పేయ్. ఇలాగని వాళ్ల వాళ్లకు తెలిస్తే బావుండదు.' కంగారుగా అన్నాడు రఘు చెల్లెలు డయల్ చేస్తూంటే

'హలో...కాస్త రేఖను పిలుస్తారా... నేను రేఖ ఫ్రండును... హలో...' రఘుకు ఫోనందించింది సరోజ.

గంభీరంగా మొదలెట్టాడు రఘు. 'హలో' గీతేనా మాట్లాడేది...'

'గీత కాదు, రేఖ'-- సరోజ మౌత్ పీస్ మూసి సరిదిద్దింది.

'హలో, ఐ ఏం సారీ. చూడండి రూపా. నేను రఘును మాట్లాడు తున్నాను.'

'ఎవరూ? ఏ రఘు మీరు?' కలకంఠి ప్రశ్న.

'ఖర్మ! నా పేరుకూడా తెలీదు' మౌత్‌పీసు మూసి గొణుక్కున్నాడు రఘు

'నేను పరంధామయ్యగారి అబ్బా యిని, సరోజ అన్నయ్యను' తన పూర్తి వివరాలు చెప్పుకున్నాడు రఘు.

'ఆఁ! ఆఁ!... అయాం సారీ, నేనే నండీ రేఖను మాట్లాడుతున్నాను. నాన్నగారిని పిలవమంటారా? ఇంట్లోనే వున్నారు మేడమీద.'

'బతికించారు!' మనసులో అను కున్నాడు.

'చూడండి రేఖా. సాయంత్రం ఆరింటికి కోఠీలో కలుసుకోగలరా?... ఏంలేదు...వూరికే మీతో మాట్లాడాలని ...సరోజా...సరోజ కూడా వస్తూంది. —థాంక్యూ!' ఫోను పెట్టేసి సరోజ చూడకుండా మొహాన పట్టిన చెమట తుడుచుకున్నాడు రఘు.

'ఏం? నన్ను కూడా రమ్మంది కదూ?' సరోజ ఆత్రుత.

'నీకు తగ్గట్టుగానే వుంది మీ ఫ్రండు.' రఘు రుసరుస. 'కాని అమ్మతో చెప్పకేం ప్లీజ్. సాయంత్రం షాపింగ్ కని బయల్దేరదాం. సరేనా?'

ఎందుకేనా మంచిదని మళ్ళీ సరోజతో ఫోను చేయించాడు రఘు.

'హలో...నేను సరోజను...ఊఁ!... మా అన్నయ్య చెప్పింది అర్థమైందా?... అలాగే నేను కూడా వస్తా, మరేం

ఫరవాలేదు ఇంట్లో ఎవరికీ చెప్పకేం అని చెప్పమన్నాడు మా అన్నయ్య... సరే...డోంట్ మెన్షన్.'

తీరా కోఠీకెళ్ళి ఇటూ అటూ చూస్తూంటే సరోజ చూపించింది రఘుకు.

'అదో రేఖ. వాళ్ళన్నయ్యతో వచ్చింది'.

వళ్ళు మండింది రఘుకు—తను ఫోన్లో చెప్పిందేమిటి, ఈవిడ వ్యవహార మేమిటి?

'హలో రఘూ!' అంటూ వచ్చాడు రేఖ అన్నయ్య. 'నాక్కాస్త పని వుంది. మీరు ఇంటిదగ్గర దిగబెడతారా రేఖను. నేనూ వచ్చేవాడినే కాని...ఆహా! థాంక్యూ—వస్తానమ్మా. హేవ్ ఏ నైస్ టైమ్'.

ఫరవాలేదు, కాస్తలో కాస్త నయం. రఘుకు గుండె దడదడ లాడుతూంది అయినా. ఈ అమ్మాయి టముకు వేసి మరీ వచ్చినట్టుగా వుందే_ ఇంట్లో తెలిస్తే నాన్న ఏమనుకుంటారు? చివాట్లేసినా వేయవచ్చు...'బుద్ధిమంతుడిలా కబుర్లు చెబుతూ ఈ షికార్లేమిటి?' అని అమ్మ నిలదీసి ఇక తన ప్రమేయం లేకుండా స్థిరపరిచి కూర్చో వెధవా అని పీటల మీద కూలేసినా కూలేయవచ్చు

రఘు ఇలా ఆలోచనలతో సతమత మవుతూంటే సరోజ, రేఖ ఏ చీకూ చింతా లేనట్టు టాక్సీ వెనక సీట్లో కూర్చుని పాత స్నేహితురాళ్ళ చితా తిరగేస్తున్నారు. అసలు సరోజను వెంట తేవడం తనతప్పు. వాళ్ళిద్దరూ కూర్చుని కబుర్లేసుకోవడానికా తాను ఇంత రిస్కు తీసుకుని జాగత్తగా ప్లానువేసి ఈవిడను పిలిచింది.

నౌబత్‌పహాడ్ మీద రూఫ్‌గార్డన్ రెస్టారెంట్‌లో ఐస్‌క్రీం చప్పరిస్తూ కూడా వాళ్ళిద్దరే కబుర్లేసుకుంటూంటే ఇక భరించలేక రెండుసార్లు గొంతు సవరించుకొని అడ్డుపడ్డాడు రఘు—

'మీకు నా పేరు కూడా తెలీదా?'

'తెలుసండీ.కానీ ఒక్కసారిగా సరోజ ఏం పలక్కుండా ఫోను మీ కందించేస్తే కంగారుపడ్డాను.' నమ్రతగా జవా బిచ్చింది రేఖ, కళ్ళు దించుకునే.

'మీ అన్నయ్యను వెంటేసుకు వచ్చారేం? సరోజ చెప్పలేదూ— ఇలాని ఎవ్వరితో చెప్పవద్దని' నిలదీశాడు రఘు.

'మా అన్నయ్యే మొదట ఫోనందు కుని నన్ను పిలిచాడు. మీరు మాట్లాడు తూంటే పక్కనే వున్నాడు మరి'—

అదిరిపడ్డాడు రఘు. 'అంటే మీ ఇంట్లో అందరికీ చెప్పారా నేనిలా ఫోను చేశానని?'

బుద్ధిమంతురాల్లా తలూపింది రేఖ అవునన్నట్టుగా. సరోజ నోట్లో రుమాలు కుక్కుకుని కాలాపహాడ్ మీది వెంక టేశ్వరస్వామి ఆలయం వేపు



చూస్తూంది. ఒకకంటఅన్నయ్యా అవస్థను గమనిస్తూనే.

కాసేపాగి అంది రేఖ, 'మనిళ్ళల్లో ఆడపిల్లను వంటరిగా ఇల్లు కదలనిస్తారా? ఎటు వెళ్తున్నానో, ఎప్పుడు వస్తానో ఖచ్చితంగా చెబితేగాని పర్మిషన్ దొరకదు'.

జుత్తు పీక్కోవాలనిపించింది రఘుకు తనకది మొదట తట్టనందుకు. మన దేశం ఇంత వెనకపడివుందేం అని తిట్టుకున్నాడు. బొమ్మలాటలా అమ్మాయినీ అబ్బాయినీ కూర్చోపెట్టి అంతా చుట్టూతా చేరి 'ఇక చూసుకోండి — నచ్చినట్టేనా' అంటారు కాని, పెళ్ళంటే ఇద్దరూ మన స్తత్వాన్నీ అభిరుచులనూ తెలుసుకుని మరీ ఒప్పుకోవాలనేనా అనిపించదు. మాట్లాడుకోవడం సంగతి దేముడెరుగు. తనకు సరిగా చూట్టం కూడా పడలేదు. పైగా తాను ఇనీషియేటివ్ తీసుకొని ఫోనుచేసి డేట్‌కోసం అడిగితే అమ్మాయిగారు 'మీరు మీ చెల్లాయిని తీసుకు రండి, నేను మా అన్నయ్యాను వెంటేసుకువస్తా'—ఇదీ వరస. పైగా సరోజతోనే డేట్ అయినట్టుగా ఒహటే గలగల.

రఘు ఈ షాక్‌లోంచి తేరుకునేలోగా మళ్ళీ కబుర్లలో పడ్డారు రేఖా, సరోజా.

'మన లతహబ్బీకి ఈ మధ్యే ప్రమోషన్ వచ్చింది తెలుసా. కాని'...

'అవును. మొన్న సుమతీ వాళ్ళింట్లో చూశాను. బాగా లావెక్కిపోయింది కదూ...'

'...ఎందుకో వాళ్ళ ఇన్‌లాస్‌తో సరిగా పడదట. వాళ్ళ మదరిన్‌లా'...

ఇలా సాగిపోతూంది వాళ్ళ సంభాషణ. కాస్సేపు పళ్ళు నూరుకున్నాడు

రఘు చేసేదేంలేక. అసలు ఈ డేట్ తనదా సరోజదా కూడా అర్థం కాలేదు. ఇద్దరి మధ్యా తను ఒక్క ముక్కా మాటాడలేకపోతున్నాడు. మధ్యలో మంచినీళ్ళు తాగడానికని రేఖ కాస్సేపు మాట్లాడ్డం ఆపేస్తే సరోజను నెమ్మదిగా చేతిమీద గోకి మొదలెట్టాడు—

'మీరు స్టడీస్ కంటిన్యూ చేయాలనుకుంటున్నారా?'

'తెలీదండీ - బహుశ చేయనేమో' సరోజవేపు చూస్తూ జవాబిచ్చింది రేఖ.

'సంగీతం వచ్చునా మీకు?'

'రాదండీ.'

ఇంకేం మాట్లాడాలో తెలీలేదు రఘుకు. తనేమాత్రం ఆగినా మళ్ళీ ఇద్దరూ కబుర్లలో పడతారు. ఇక తన పని ఖాళీ.

'ఢిల్లీ చూశారా ఎప్పుడేనా?'

'మొన్న డిసెంబర్లో ట్రేడ్ ఫేర్ చూట్టానికెళ్ళాం'.

'ఎలావుంది ఢిల్లీ మీకు?'

'చలి బాగా ఎక్కువ. ట్రేడ్ ఫేర్ బాగానే వుంది. ఢిల్లీ కూడా ఫరవాలేదు.

ముక్తసరిగా జవాబివ్వడం ఈ అమ్మాయి దగ్గిరే నేర్చుకోవాలి అనుకున్నాడు రఘు.

ఇంతలో రేఖ గడియారంవేపు ఓ సారి చూసుకుని 'వెళ్ళాలి' అన్నట్టుగా తలాడించింది సరోజవేపు.

రామచంద్రా! అనుకున్నాడు రఘు.

'వాళ్ళన్నయ్య ఎనిమిదింటివరకల్లా రమ్మన్నాడట' సరోజ సమర్థింపు.

పోయిన గంటన్నరలో తాను మాట్లాడింది వెరసి నాలుగున్నర నిముషాలు. ఇదీ తన మొదటి డేటు— బహుశ చివరిది కూడా నేమో. కసిగా అనుకున్నాడు బిల్లు ప్లేట్లో వదులుతూ.

చీకట్లో టాక్సీ కోసం అరగంట సేపు తచ్చాడి, టాక్సీవాలా షరతులన్నింటికీ తలఒగ్గి మొదట రేఖ వాళ్ళింటి అడ్రసు ఇచ్చాడు. ఇంటి ముందు టాక్సీ ఆగగానే ప్రతి కిటికీలోంచీ ఒక్కో తలకాయ బయటకు చూస్తూ వుండటం గమనించి హడలిపోయాడు రఘు ఇంట్లోంచి గబ గబా వస్తూన్న రేఖ అన్నయ్యను గమనించి తారెత్తిపోయి, రేఖ కిందికి దిగగానే 'జల్దీ చలో' అని టాక్సీవాలాను ప్రార్థించి ఆమీద అత్యంత సమయస్ఫూర్తితో 'చాలా థాంక్స్ రేఖా' అని ధన్యవాదాలు చెప్పుకున్నాడు. టాక్సీవాలా కూడా ఉద్ధంగసింకం. కన్ను మూసి తెరిచేంతలో టాక్సీ కాచీగుడా చౌరస్తా చేరుకుంది. 'హమ్మయ్య' ఫ్రీగా వూపిరి పీల్చుకోగలిగాడు రఘు

'మనదేశంలో డేటింగు పనికిరాదు.' ఘాటుగా అనుకున్నాడు రఘు, రేఖ మెళ్ళో మూడు ముళ్ళు వేస్తూ.